పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర

- టీడీపీ నేతలకు దోచిపెట్టేందుకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన కార్యక్రమంలో డాక్టర్ దార సుధీర్
- నంద్యాల మెడికల్ కళాశాలకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- నేషనల్ హైవే నుంచి పటేల్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ


హైవే నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు


నంద్యాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

నందికొట్కూరు: రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి చలో నంద్యాల మెడికల్ కళాశాల నిరసన కార్యక్రమానికి బయల్దేరిన పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ దారను, వైఎస్సార్‌సీపీ శ్రేణులను పోలీసులు నేషనల్ హైవే వద్ద అడ్డుకున్నారు. దీంతో దగా సీఎం చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేస్తూ నేషనల్ హైవే నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. పటేల్ సెంటర్‌లో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్, పార్టీ శ్రేణులు బైఠాయించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే సీఎం డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు.

పోలీసులు అడ్డుకోవడం దారుణం..

శాంతియుతంగా చలో నంద్యాల కార్యక్రమానికి బయల్దేరిన మమ్ములను నేషనల్ హైవే వద్ద పోలీసులు అడ్డుకోవడం దారుణమని డాక్టర్ దార సుధీర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులను డాక్టర్లు కాకుండా అడ్డుకోవడానికి సీఎం చంద్రబాబు వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రపన్నారన్నారు. పేద విద్యార్థుల గురించి ఏ మాత్రం ఆలోచించకుండా టీడీపీ నేతలకు దోచిపెట్టేందుకే ప్రైవేటీకరణ చేసేందుకు టెండర్లకు పిలవడం జరిగిందని చెప్పారు. వైఎస్ జగనన్న పాలనలో భారత దేశం చరిత్రలో ఒకేసారి 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారని గుర్తు చేశారు. ఐదు మెడికల్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తుంటే నిర్మాణాలే జరగలేదని సీఎం బాబు ప్రకటించడం సిగ్గు చేటన్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తిస్థాయికి చేరుకున్న సీఎం చంద్రబాబు నిర్మాణాలే చేపట్టలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. చంద్రబాబు పాలనలో మెడికల్ కాలేజీలు తెలుగు తమ్ముళ్లకు, బంధువులకు టెండర్ల ద్వారా కట్టబెట్టడం అందరికీ తెలిసిందేనన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, జెడ్పీటీసీలు జగదీశ్వరరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, సర్పంచులు శేషన్న, జనార్దన్‌గౌడు, స్వామిరెడ్డి, నాగార్జునరెడ్డి, సీనియర్ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ తులసిరెడ్డి నాయకులు, మాధురి, నాగరాజు, అబుబక్కర్, విజ్జి, రమణ, పాలూరి వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, గౌస్, మండ్లెం రమణ, మద్దిలేటి, లడ్డూ, రాజు, చరణ్, అబ్దుల్లా, సీపీఐ నాయకుడు రఘురామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వైద్య సేవలు అందాలి

పాములపాడు: మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినయ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, వైద్యాధికారి నాగలక్ష్మిలతో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా గ్రామాల్లో టైఫాయిడ్, వైరల్ ఫీవర్లు ఎక్కువగా ఉన్నాయని తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజలకు పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తపల్లి: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో చెత్తసేకరణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త సేకరణ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించాలని చెప్పారు. అనంతరం గోకవరం సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి తగుసూచనలు చేశారు.

క్లుప్తంగా

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి


మెడకు ఉరితాడు వేసుకొని నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

నందికొట్కూరు: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షులు జే. మహేశ్వర డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట మెడకు ఉరితాడు వేసుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల కార్యదర్శి శివన్న, సభ్యులు రంగస్వామి, మహేశ్వరుడు, సుధాకర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం


నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది: క్షేత్రంలో కొలువైన నందీశ్వరుడికి భాద్రపద మాసం, బహుళ త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం అభిషేకార్చనలు నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ, పుణ్యాహ వాచనం, అనంతరం పంచామృతం, పాలతో పాటు విశేష ద్రవ్యాలతో అభిషేకం, పూజలుశాస్త్రోక్తంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పూజలు వీక్షించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం


నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన గాయత్రీ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో వినాయకకౌత్వం, మల్లికార్జున కౌత్వం, శివాష్టకం, జయ జయ దుర్గ, జతిస్వరం, శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు డాక్టర్ జ్యోతిశేఖర్, పావని, సంజనరావు, ఆరాధ్య, కీర్తన, చైత్ర నృత్యం ప్రదర్శించారు.

తప్పిన ప్రమాదం


అదుపుతప్పి కింద పడిన ఆటో

మహానంది: అరటి ఆకులతో వస్తున్న ఆటో బోల్తాపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. బుక్కాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు అరటి ఆకులను ఆటోలో తీసుకుని అయ్యన్ననగర్ సమీపంలోని తెలుగు గంగ కాలువ వెంట వస్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. అయితే ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఆటోలో ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజల అనంతరం పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం


సయ్యద్ సలీంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహానంది: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఈఓ రామసుబ్బయ్య అన్నారు. మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయుడు సయ్యద్ సలీం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయ లోపం..

- రైతులకు శాపం
- సిద్దాపురం పంట కాల్వలపై బ్రిడ్జీలను పట్టించుకోని ఎన్‌హెచ్ఏఐ


రోడ్డు వరకు వచ్చి ఆగిన పంట కాల్వ

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలో కల్వకుర్తి - నంద్యాల జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయి. నల్లకాల్వ - బాపనంతాపురం మధ్యలో పనులు మొదలుపెట్టారు. అయితే పని ప్రారంభమైన చోటే సిద్దాపురం ఎత్తిపోతల పథకానికి చెందిన ఓ పంట కాల్వ రహదారి వరకు వచ్చి ఆగిపోయింది. కాల్వ పనులు కరివేన వరకు చేపట్టాల్సి ఉంది . అయితే నిధుల కొరతతో పనులు పూర్తి కాలేదు. జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే రోడ్డు వరకు ఉన్న పంట కాల్వ ముందుకు తీసుకెళ్లేందుకు సాధ్యం కాదు. రహదారి పూర్తయిన తరువాత రోడ్డును తొలగించి బ్రిడ్జి వేయడం సాధ్యమయ్యే పని కాదు. అయితే సిద్దాపురం ఎత్తిపోతల పంట కాల్వల ప్లాన్ వివరాలు నేషనల్ హైవే అథారిటీ అధికారుల వద్ద లేక పోవడం గమనార్హం. వారికి వివరాలు తీసుకోవాలన్న ఆసక్తి లేకపోవడం, ఇవ్వాలన్న బాధ్యత స్థానిక అధికారులకు లేక పోవడం రైతులకు శాపంగా మారనుంది. ఇరువైపులా అధికారులను ఈ అంశంపై ప్రశ్నించగా.. స్పందించకపోవడం గమనార్హం. ఈ ప్రాంతంలో పంటకాల్వ రోడ్డు దాటడానికి వీలుగా బ్రిడ్జి నిర్మించకపోతే కరివేన, బాపనంతాపురానికి చెందిన వందలాది ఎకరాలకు సాగునీరు అందకుండా పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో పంట కాల్వల ప్లాన్ ప్రకారం రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నందీశ్వరస్వామికి విశేష పూజలు


బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీస్వామి,అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజుల్లో నందీశ్వరుడి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. శుక్రవారం 31 మంది భక్తులు పరోక్షసేవలో పాల్గొన్నారు. నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు జరిపించారు. ముందుగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగేందుకు గణపతి పూజ, తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, ఫలోదకాలు, మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం చేసి నూతన వస్త్రసమర్పణ, విశేషార్చనలు చేపట్టారు. బసవన్నకు నానపెట్టిన శనగలను, క్షేత్ర పాలకుడికి ప్రత్యేక నైవేద్యం సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

26న మండల సర్వసభ్య సమావేశం

మహానంది: ఈ నెల 26వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పశువులకు 'గాలికుంటు' నిరోధక టీకాలు

బండి ఆత్మకూరు : మండలంలోని పార్నపల్లి, సంతజూటూరు గ్రామాల్లోని పశువులకు శుక్రవారం పశు వైద్యులు అనూష, జ్యోత్స్నదేవి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పార్నపల్లిలో జరిగి న కార్యక్రమాన్ని వెలుగోడు సహాయ సంచాలకులు డాక్టర్ ఏ.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. కాగా నేడు పెద్దదేవలాపురం, కాకనూరు గ్రామాల్లో టీకాల కార్యక్రమం ఉంటుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఏ పాపిరెడ్డి పాల్గొన్నారు.

యూరియా పంపిణీ కౌంటర్ల పరిశీలన

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో శుక్రవారం చేపట్టిన యూరియా పంపిణీ కౌంటర్లను తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ నాగేంద్రకుమార్ పరిశీలించారు. ఒక్కొక్క రైతు సేవా కేంద్రానికి 23.94 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు వ్యవసాయ అధికారి మురళీధర్ వెల్లడించారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించండి

పాములపాడు: ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శు లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి తిరగాలన్నారు. కార్యాలయాలకు వెళ్లకుండా ప్రభుత్వ సేవలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సులోచన తదితరులు పాల్గొన్నారు.

పొదుపు రికార్డుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

పగిడ్యాల: స్వయం సహాయక సంఘాల రికార్డుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని నంద్యాల జిల్లా డీపీఎం నాయక్ విలేజ్ బుక్ కీపర్లకు ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెలనెలా పొదుపు మహిళ లు జరిపే లావాదేవీలు రూ.లక్షల్లో ఉంటుందన్నారు. పుస్తక నిర్వహణ చేసే బుక్ కీపర్లు అప్రమత్తత కలిగి అప్పు నిల్వలు, జమలు వ్యత్యాసం రాకుండా నమోదు చేయాలన్నారు. బుక్ కీపర్లు అవతవకలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నతి ఏపీఎం శివ, ఏపీఎం కళావతి, సీసీలు స్వర్ణమేరీ, శ్రీనివాసులు, నాగన్న పాల్గొన్నారు.

నేడు 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'

వెలుగోడు: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..అధికారులు, ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు, వైద్య ఆరోగ్య శాఖ, ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థులతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు శనివారం సెలవు ఉండదని, విధులకు హాజరుకావాలని ఆదేశించారు.

ధర్మమార్గంలో నడిచే వారికి దైవం తోడ్పాటు



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు, గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

నందికొట్కూరు: ధర్మమార్గంలో నడిచే వారికి దైవం తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారం ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయిబాబాపేటలోని భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచారం పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయంలో గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు లక్ష్మణ, శేషయ్య ఆధ్వర్యంలో మహిళలతో సామూహిక లక్ష్మీ అష్టోత్తరం, గోమాతకు పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు బలరామాచార్య చేసిన ధార్మిక ప్రవచనాలు, భజనలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ధార్మిక సంఘం వ్యవస్థాపకులు గణేష్, అధ్యక్షులు బైసాని నారాయణశెట్టి, సభ్యులు రామిరెడ్డి, ఈపూరి ఓంకారమయ్య, రాజశేఖర్, వెంకటశేషయ్య, సురేష్‌గుప్తా, న్యాయవాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం


మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న దార సుధీర్

జూపాడుబంగ్లా: ఆపదలో ఉన్న ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు ఇన్‌చార్జ్ దార సుధీర్ అన్నారు. మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కిషోర్‌కుమార్ ఈనెల 16న అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పార్టీ ఇన్‌చార్జ్ శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్య కీర్తిని పరామర్శించి ఓదార్చారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తనకు తెలియజేస్తే తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని దారాసుధీర్ భరోసా ఇచ్చారు. అనంతరం మృతుని అన్న నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌ను పరామర్శించి మృతుని వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి, కోకిల రమణారెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, చిన్నమల్లయ్య, నాగరత్నం తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్

కొత్తపల్లి: గిరిజన గూడెంలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ కే.జీ. నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని శివపురం గ్రామపంచాయతీలో ఉన్న శివపురం చెంచుగూడెంలో గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తనిఖీల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరన్న, ఐటీడీఏ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రాజు నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థుల అరెస్టు దారుణం

నందికొట్కూరు: మెడికల్ కళాశాలలు ప్రైవేట్‌పరం చేయకూడదని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీ చార్జీ చేసి, అరెస్టు చేయడం దారుణమని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో పేద విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసిందని, అయితే ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో లేకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పనున్నతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిర్బంధాలు ఉండవని ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ఎన్నికల ప్రచారంలో నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే ఆందోళనకారులపై లాఠీ చార్జీ చేయడం, కేసులు బనాయించడం దుర్మార్గమని చెప్పారు. సమావేశంలో సీపీఎం నాయకులు నక్క స్వాములు, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసు నాగార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలో 20 రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు వేసిన మొక్కజొన్న, పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలు భారీగా నష్టపోయాయన్నారు. దీనికి తోడు గుమ్మడాపురం, సింగరాజుపల్లె, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాల్లో అడవి పందులు పొలాల్లో చొరబడి పంటలను నాశనం చేస్తున్నందువల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు ఎకరాకు రూ.40 వేలు నష్టపరిహారం వెంటనే చెల్లించి ఆదుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఉమా రాణి, ఎంపీడీఓ మేరిలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చేరుకుచెర్ల గాబ్రియేలు, సామన్న, శీలన్న, సుధాకర్, మేకల శేఖర్, సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అధ్యాపకుడి మృతి


వెంకటయ్య (ఫైల్)

కొత్తపల్లి: గుండెపోటుతో అధ్యాపకుడు మృతి చెందిన ఘటన కొత్తపల్లి మండలంలోని కొక్కెరంచ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన కలుబండి వెంకటయ్య (49) నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన 18 ఏళ్లుగా అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన ప్రతి రోజు గ్రామం నుంచి నంద్యాలకు వెళ్లేవారు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటివద్ద ఛాతి నొప్పితో అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ప్రభుత్వం స్పందించి అదే కళాశాలలో మృతుడి భార్యకు ఉద్యోగం కల్పించి ఆ కుటుంబానికి భరోసా కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు


బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఇండోర్‌స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలురు, బాలికల బాక్సింగ్ పోటీలు హోరాహోరీగా సాగాయి. 170 మంది క్రీడాకారులు పాల్గొన్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు విశ్వనాథ్, ఆశాజ్యోతి పర్యవేక్షించగా గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ డైరెక్టర్ మౌలాలిరెడ్డి ప్రారంభించారు. ప్రతిభ కనబర్చిన వారు అక్టోబర్ 15 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు త తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శివరాం, క్రీడల అభివృద్ధి అధికారి రాజు, ఏపీ రెడ్డి, సురేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం


షహనాజ్ బేగంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెలుగోడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని వి.షహనాజ్ బేగం గణితశాస్త్రంలో పీహెచ్‌డీ పొందిన సందర్భంగా హెచ్ఎం మాలిక్ ఖాన్, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి మార్గ దర్శకత్వంలో 'విస్కాసిటీ యాక్టివేషన్ ఎనర్జీ ప్రభావం- ఎనర్జీ నానో ద్రవాల ఉష్ణ సంచలనం అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించడంతో యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి షానాజ్ బేగం డాక్టరేట్ పొందారు. సీనియర్ ఉపాధ్యాయుడు మొయినుద్దీన్, జీవీ వెంకటసుబ్బయ్య, ఆపస్ నాయకులు కృష్ణార్జున రెడ్డి, పార్థసారథి రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎ.రాజశేఖర్

ఆత్మకూరు: అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ధనుంజయ మీటింగ్ హాలులో రైతు సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల అంచనా మేరకు జిల్లాలో మొక్కజొన్న 1,54,010 ఎకరాలు, మినుము 25,897 ఎకరాలు, సోయాబీన్ 12,367 ఎకరాలు సాగు చేయగా అధిక వర్షాల కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. నాయకులు రామచంద్రుడు, మహబూబ్ బాషా, వీరన్న, కృష్ణమోహన్, నాగన్న పాల్గొన్నారు.

దాడుల నుంచి రక్షించాలని ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేసి నూతన సవరణ చట్టాన్ని తీసుకొచ్చిన సందర్భంగా తమను దాడుల నుంచి రక్షించాలని శుక్రవారం స్థానిక ఇస్లాంపేట మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూరు: పట్టణంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈ రామసుబ్రహ్మణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల కారణంగా సరఫరా ఉండదన్నారు. ఆ తర్వాత యథావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.